క్లుప్తంగా

మాజీ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే, నాయకులు



మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌ను సన్మానిస్తున్న హరీశ్‌రావు పక్కన సునీతారెడ్డి

నర్సాపూర్: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు పలువురు నాయకులు ఆదివారం కలిశారు. అశోక్‌గౌడ్ నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆదివారం హరీశ్‌రావును కలువగా ఆయన అశోక్‌గౌడ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అశోక్‌గౌడ్ మాజీ మంత్రిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఇతర నాయకులు అశోక్‌గౌడ్, రాజుయాదవ్, చంద్రాగౌడ్, గోపి, రాంచందర్, బాల్‌రెడ్డి, భిక్షపతి, /జ్ఞానేశ్వర్, నగేష్, ఆంజనేయులుగౌడ్, దావూద్, సాగర్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



బ్యాటింగ్ చేస్తున్న ఆవుల రాజిరెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): యువత అన్ని రంగాలతో పాటు క్రీడల్లో రాణించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బండపోతుగల్ గ్రామంలో యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలకు, క్రీడాకారులకు తనవంతు సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. యువత మైదానంలో క్రీడలు ఆడటంతోనే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పండరి, నాయకులు మల్లేశం, సుభాష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, శశికాంత్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లయన్స్ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు పట్టి హిల్

రామాయంపేట(మెదక్): రక్తదానం, అవయవదానానికి సంబంధించి వాల్ పోస్టర్‌ను లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి రూపొందించారు. ఈ సందర్భంగా ఆ వాల్ పోస్టర్‌ను శనివారం రాత్రి హైదరాబాద్‌లో లయన్స్ అంతర్జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పట్టి హిల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటికి నిప్పుపెట్టిన నిందితుల రిమాండ్

శివ్వంపేట(నర్సాపూర్): ఇంటికి నిప్పుపెట్టిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు. మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన సోమగారి ప్రశాంత్, పక్కంటి అమ్మాయి పిట్ల జ్యోతి ప్రేమించుకున్నారు. ఇద్దరు శుక్రవారం పెళ్లి చేసుకున్నారు. ఈ విషయం తెలియడంతో అమ్మాయి తండ్రి శివరాములు, అన్న జయేందర్, పెద్దనాన్న భిక్షపతితో పాటు మరికొందరు అబ్బాయి ఇంటికి నిప్పుపెట్టారు. దీంతో వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు చెప్పారు.

జాతీయ రహదారి నిబంధనలు పాటించాలి



పెద్దశంకరంపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ బాలరాజు

పెద్దశంకరంపేట(మెదక్): జాతీయ రహదారి నిబంధనలను ప్రతీ ప్రయాణికుడు పాటించాలని పేట ఎస్ఐ బాలరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రం పెద్దశంకరంపేటలో 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వెళ్లొద్దని, హెల్మెట్, సరైన ధృవపత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడొద్దని సూచించారు. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎస్ మేనేజర్ మోయినొద్దీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉడకని అన్నం.. నీళ్ల చారు

- గురుకులంలో అధ్వానంగా మధ్యాహ్న భోజనం
- ఆందోళనకు దిగిన విద్యార్థుల తల్లిదండ్రులు



తునికి బీసీ గురుకుల పాఠశాలలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

కౌడిపల్లి(నర్సాపూర్): గురుకులంలో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటన మండలంలోని తునికి ఎంజేపీ (మహాత్మ జ్యోతిబాపూలే) బీసీ గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. ఆదివారం సెలవు కావడంతో తునికి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులను కలిసేందుకు పలువురు తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. కాగా విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. అన్నం సరిగా ఉడకలేదని, గుడ్డు చారు పేరుతో నీళ్ల చారు పోశారని విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఓ వైపు విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నామని చెపుతుండగా.. తునికి ఎంజేపీలో మాత్రం ఎప్పుడు భోజనం సరిగా పెట్టడం లేదన్నారు. ఉడకని భోజనం తినడం వల్ల పలుమారు విద్యార్థులకు అస్వస్థతకు గురవుతున్నారని ఆరోపించారు. గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యబోధన సైతం సరిగా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులు ఎక్కువగా ఇంటి బాట పడుతున్నారని వాపోయారు. ఈ విషయం ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. అతను లేకపోవడంతో విధుల్లో ఉన్న టీచర్‌ని నిలదీశారు. కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యను అందించాలని కోరారు.



ముద్దముద్దగా అన్నం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కిటకిటలాడిన ఏడుపాయల



భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ

పాపన్నపేట(మెదక్): ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన ఏడుపాయల ఆదివారం వేలాది భక్తులతో కిటకిటలాడింది. అర్చకుడు పార్థివశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు తీసి, ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్ రెడ్డి భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఓడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం భక్తులతో రద్దీ నెలకొంది. ఆదివారం ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పురోహితులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీసి, ఓడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు తలనీలాలు సమర్పించడంతో పాటు వాహనాలకు పూజలు చేయించారు. డప్పు చప్పుడు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా మారింది. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లు చేశారు.



నర్సాపూర్ రూరల్: ప్రత్యేక పూజలు చేస్తున్న మల్లేశ్‌గౌడ్

భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో..

నర్సాపూర్ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో వెలిసిన కేతకి భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయం ఆదివారం ఆలయ ఫౌండర్ వాల్దాస్ మల్లేశ్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తి భజన కార్యక్రమాలు చేశారు.

మూఢనమ్మకాలతోనే అఘాయిత్యాలు

నర్సాపూర్ సీఐ కృష్ణ



బహుమతులతో విద్యార్థులు

నర్సాపూర్‌రూరల్: సమాజంలో మూఢనమ్మకాలతోనే చాలా అఘాయిత్యాలు జరుగుతున్నాయని, ప్రజలు శాస్త్రీయ దృక్పదం అలవర్చుకోవాలని నర్సాపూర్ సీఐ కృష్ణ సూచించారు. ఆదివారం నర్సాపూర్‌లో జన విజ్ఞాన వేదిక మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా నర్సాపూర్ లయన్స్‌క్లబ్ సౌజన్యంతో విద్యార్థులకు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 20 స్కూల్స్‌కు చెందిన మండల స్థాయి విజేతలు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సాపూర్ సీఐ కృష్ణ, ఎంఈఓ బుచ్యానాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మూఢనమ్మకాలతో చాలా అఘాయిత్యాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భావి భారత పౌరులుగా విద్యార్థులు అందరూ, శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మీరు సంపాదించిన జ్ఞానాన్ని మీ చుట్టుపక్కల వాళ్లకి తెలియజేయాలని కోరారు. ఈ పరీక్షలో మూడు జట్లు రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనుటకు అర్హత సాధించారు. తెలుగు మీడియంలో వాసవీ, నింగయ్య జెడ్పీహెచ్ఎస్, ధన్నూర, టేక్మాల్ మండలం, ఇంగ్లీష్ మీడియంలో బూర్గుపల్లి, హవేళిఘణాపూర్ మండలాల్లోని జెడ్పీహెచ్ఎస్‌లకు చెందిన రాఘవేందర్, సాత్విక, అభినేత్రిలు ప్రథమస్థానంలో నిలిచారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల నుంచి వినయ్, నిశాంత్ శర్మ, జస్వంత్‌కుమార్, గీతా హైస్కూల్ తూప్రాన్ బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ నరసింహారెడ్డి, రిటైర్డ్ గెజిటెడ్ హెచ్ఎం షఫీయుద్దీన్, జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు మోహన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవుల, కోశాధికారి పండరి, జిల్లా బాధ్యులు రమేశ్ రాజు, చంద్రశేఖర్, కిరణ్ కుమార్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, నాగరాజు, శంకరాచారి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు ఇవ్వండి



మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌తో నార్సింగి మండల నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌ను నార్సింగి మండలంలోని శేరిపల్లి, సంకాపూర్, జప్తిశివనూర్ గ్రామాల కాంగ్రెస్ నాయకులు కలిసి కోరారు. ఆదివారం దూలపల్లిలోని మైనంపల్లి నివాసంలో ఎమ్మెల్యేను ఆయా గ్రామాల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేరిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, చిన్నకృష్ణాగౌడ్, లక్ష్మీనర్సింలు, సంకాపూర్ మాజీ ఉపసర్పంచ్ కేశవులు, జప్తిశివనూర్ మాజీ ఉపసర్పంచ్ రుక్మొద్దీన్‌లు ఉన్నారు. అలాగే మండలంలోని రుద్రారం కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రోహిత్‌ను కలిసి గ్రామ అభివృద్ధికి నిధులు అందించాలని కోరారు.

అర్హులందరికీ వెంటనే పెన్షన్లు ఇవ్వండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దేవయ్య



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేవయ్య, మల్లేశం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని అర్హులైన వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు బీడీ కార్మికులకు ఇతర పెన్షన్ దారులకు ప్రభుత్వం వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేవయ్య, మల్లేశం డిమాండ్ చేశారు. ఆదివారం మెదక్‌లోని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని జిల్లాలో పెన్షన్ దారులు 1,15,000, వృద్ధులు 30000, వితంతువులు 45000, దివ్యాంగులు 9500, బీడీ కార్మికులు 15000, ఒంటరి మహిళలు 14000 ఇతర పెన్షన్ దారులు పెన్షన్‌రాక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పెన్షన్ దారులకు సరైన సమయానికి ఇవ్వకపోవడం వలన ప్రభుత్వం కూలిపోయిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం నూతనంగా ఏర్పడి రెండు నెలలు గడుస్తున్న గత ప్రభుత్వం మాదిరిగా సమయానికి పెన్షన్లు ఇవ్వడం లేదన్నారు. వృద్ధులు నిత్యావసర ఖర్చులకు, వైద్యం ఖర్చులకు లేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులతో కలిసి జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహిళా కన్వీనర్ నాగమణి, నాయకులు రాజిరెడ్డి, ఐలయ్య, రామస్వామి, సత్యం, కమల పాల్గొన్నారు.

మున్నూరు సంఘం అధ్యక్షుడిగా రాములు



ఆత్మీయ సమ్మేళనంలో మున్నూరు కాపులు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్నపేట మున్నూరు సంఘం అధ్యక్షుడిగా ఆదివారం టప్ప రాములు ఎన్నికయ్యారు. ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా ఎన్నికలు నిర్వహించారు. యువజన సంఘం అధ్యక్షుడిగా అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా దిలీప్ కుమార్, కార్యదర్శిగా అభిరాం, ఉపాధ్యక్షులుగా రాంచందర్, అభిలాష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాలన్నారు. పరస్పర సహకారం అందించుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సుంకరి కిష్టయ్య, ఆకుల శ్రీనివాస్, సంగమేశ్వర్, మల్లప్ప, ఉమా మహేశ్వర్, ప్రసాద్, మహిపాల్ తదితరులు ఉన్నారు.

పాఠశాల స్థలం పరిశీలన

స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్



కబ్జాకు గురైన ఎస్టీ గురుకుల పాఠశాల స్థలంలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఐ విఠల్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని భుజిరంపేటలో కబ్జాకు గురైన ఎస్టీ గురుకుల పాఠశాల స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఆదివారం 'సాక్షి' దినపత్రికలో ఎస్టీ గురుకుల పాఠశాల స్థలం కబ్జా అనే ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు కౌడిపల్లి ఏఎస్ఐ విఠల్ క్షేత్రస్థాయిలో కబ్జాకు గురైన భూమిని, భూమి చుట్టు వేసిన ఫెన్సింగ్, వరిపొలం, బోరు బావిని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు, రైతులతో మాట్లాడి కబ్జా వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారు. దీనిపై ఇంటలీజెన్సీ అధికారులు సైతం వివరాలు సేకరించారు. రాజకీయ నాయకుల ప్రమేయంపై సైతం ఆరా తీస్తున్నారు.

మాసాయిపేట శివారులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేట శివారులోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని లక్ష్మీగణపతి ప్యాకింగ్ ప్రాడక్ట్ పరిశ్రమ స్క్రాప్ సెక్షన్‌లో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. పరిశ్రమ నిర్వాహకులతో పాటు గ్రామస్తులు ఫైరింగ్ స్టేషన్‌కు సమాచారం అందించగా, సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేశారు. కార్మికులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా మంటలు అదుపులోకి రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. స్క్రాప్ సెక్షన్ కావడంతో దాదాపు రెండు లక్షల ఆస్తి నష్టం సంభవించి ఉండొచ్చునని పరిశ్రమ నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ అద్వానీకి భారతరత్నపై హర్షం

పెద్దశంకరంపేట(మెదక్): బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉప ప్రధాని లాల్‌కృష్ణ అద్వానీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడంపై బీజేపీ మండల అధ్యక్షుడు విఠల్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అయోధ్యలో రామాలయం నిర్మాణానికి, బీజేపీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్‌కుమార్, కృష్ణ తదితరులున్నారు.

◆ ఇద్దరికి తీవ్ర గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలో వెల్దుర్తి గ్రామానికి చెందిన వీరస్వామి చిన్నగొట్టిముక్ల గ్రామంలో ఉన్న బంధువుల వద్దకు బైక్‌పై బయలుదేరాడు. చిన్నగొట్టిముక్లకు చెందిన ఆర్టీసీ కండక్టర్ అశోక్ గ్రామానికి వెళ్లేందుకు శివ్వంపేటలో లిఫ్ట్ అడిగి వీరస్వామి బైక్‌పై ఎక్కాడు. దీంతో పెట్రోల్ బంకు వద్ద నర్సాపూర్ నుంచి తూప్రాన్ వైపుకు వేగంగా వచ్చిన లారీ వీరి బైక్‌ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.

◆ సన్మానం



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేటలో ఆదివారం గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగంగౌడ్, ఉప సర్పంచ్ మాధవిశివ, వార్డు సభ్యులు మన్నె ప్రవీణ్ భవంత్‌గౌడ్, యాదాగౌడ్ తదితరులను గ్రామస్తులు, యూత్ సభ్యులు కృష్ణ, భాష, పంచాయతీ కార్యదర్శి నరహరి, శివ్వయ్య, మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ దివ్యాంగులకు దరఖాస్తుల తిప్పలు

అల్లాదుర్గం(మెదక్): దివ్యాంగులకు సదరం క్యాంపులో సర్టిఫికెట్లు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కనీసం దరఖాస్తు కోసం ఒక రోజు ఆన్‌లైన్ ఓపెన్ చేసి ఉంటే దివ్యాంగులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే ప్రభుత్వం కేవలం గంట సేపు మాత్రమే ఆన్‌లైన్ దరఖాస్తు కోసం ఓపెన్ చేసి ఉంచడంతో దివ్యాంగులు దరఖాస్తులు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతీ నెల సదరం శిబిరాలు ఏర్పాటు చేస్తున్న తమకు ఎలాంటి ఉపయోగం లేదంటున్నారు. అయితే దరఖాస్తులు చేసుకునేందుకు సమయం కేటాయించాలని వారు కోరుతున్నారు.

◆ కార్యకర్తలతో సమావేశానికి తరలిన రఘునందన్

చేగుంట(తూప్రాన్): పార్టీ నాయకులతో మనోహరాబాద్‌లో ఆదివారం జరిగే సమావేశానికి దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేగుంట కార్యకర్తలతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల కోసం నిర్వహిస్తున్న సమావేశానికి కార్యకర్తలతో కలిసి వెళ్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్టీ బలోపేతం కోసం ముఖ్య కార్యకర్తల సమావేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చేగుంట మండలాధ్యక్షుడు భూపాల్, మాజీ సర్పంచ్‌లు రఘువీర్, అంజాగౌడ్, జగన్‌గౌడ్, నాయకులు బాలసాయి హరిప్రసాద్, భిక్షపతి, చంద్రశేఖర్, మండల కార్యకర్తలు ఉన్నారు.

◆ పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్‌గా రమేశ్‌గౌడ్



పాపన్నపేట(మెదక్): మెదక్ పార్లమెంట్ ఎన్నికల మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా మెదక్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కుర్తివాడ ఎంపీటీసీ రమేశ్‌గౌడ్‌ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

◆ నర్సంపల్లిలో సేవాలాల్ ఉత్సవాలు



చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం నర్సంపల్లితండాలో ఆదివారం సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ ఉత్సవాల్లో నార్సింగి జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీటీసీలు సత్యనారాయణ, సుజాత హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దతండా మాజీ సర్పంచ్ చత్రియానాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాబు, యోగి, భూపతిరాజు, బిక్యానాయక్ పాల్గొన్నారు.